న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

- అంగన్‌వాడీ టీచర్ల డిమాండ్
- ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ఎదుట ఆందోళన

ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

ధర్మపురి, జూలై 15: న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీ టీచర్లు ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. క్యాంపు ఆఫీసును ముట్టడించేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నంబర్ 10ను యథావిధిగా అమలు చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను టీచర్‌కు రూ.2లక్షలు, హెల్పర్స్‌కు రూ.లక్షకు పెంచాలని, కారుణ్య నియామకాలు వంటి 20 డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని కోరారు. విషయం తెలుసుకున్న ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ స్థానిక నాయకులతో ఫోన్లో మాట్లాడారు. డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

ప్రజావాణి సమస్యలకు ప్రాధాన్యమివ్వాలి

- కలెక్టర్ బీ సత్య ప్రసాద్

జగిత్యాల, జూలై 15 : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యమిచ్చి పరిష్కరించాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు పీ రాంబాబు, గౌతమ్‌రెడ్డితో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రం తోపాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వస్తారన్నారు. అధికారులు శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించాలని, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 91 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. అన్ని ఆఫీసుల్లో ఫాగ్ స్ప్రే చేయించాలన్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

జిల్లా అంతటా శానిటేషన్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పీ రాంబాబు, గౌతమ్ రెడ్డి, జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్‌కుమార్, ఎన్ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, జిల్లా అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల డిపాజిట్ డబ్బులను తిరిగి చెల్లించాలి

రాయికల్, జూలై 15 : గొర్రెల యూనిట్లకు యాదవులు చెల్లించిన డిపాజిట్ డబ్బులను ప్రభుత్వం తిరిగి వారికి చెల్లించాలని కోరుతూ రాయికల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ బర్కం మల్లేశ్ యాదవ్ ప్రజావాణిలో కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. గొర్రెల డిపాజిట్ డబ్బులను త్వరగా చెల్లించి వారికి న్యాయం చేయాలని కోరారు. ఇందులో రాయికల్ మున్సిపల్ కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి, బర్కం మహేశ్ పాల్గొన్నారు.

పెగడపల్లి ప్రజావాణిలో ఒకే ఒక్కరు

పెగడపల్లి, జూలై 15: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి తహసీల్దార్ శ్రీనివాస్ సహా, మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి ఒక్కరే హాజరయ్యారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి అన్ని శాఖల మండలాధికారులు హాజారు కావాలనే నిబంధన ఉన్నప్పటికీ, సంబంధిత శాఖల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో, సమస్యలపై దరఖాస్తులు ఇచ్చే వారు నిరాశతో వెళ్లిపోతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా, ప్రజావాణికి అధికారుల గైర్హాజరుపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పెగడపల్లి : ప్రజావాణిలో పాల్గొన్న తహసీల్దార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

అ'పూర్వ' సమ్మేళనం

సమ్మేళనంలో 1969 హెచ్ఎస్సీ బ్యాచ్ విద్యార్థులు

ధర్మపురి, జూలై 15 : ధర్మపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1968-1969 విద్యాసంవత్సరంలో హెచ్ఎస్సీ చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ధర్మపురిలో సమ్మేళనమై తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. 55 సంవత్సరాల క్రితం చదువుకున్న వారంతా పట్టణంలోని సంస్కృతాంధ్ర కళాశాల మాజీ ప్రిన్సిపల్ సంగనబట్ల నర్సయ్య నేతృత్వంలో కలుసుకున్నారు. చైతన్య భారతి పాఠశాల వ్యవస్థాపకుడు సంగనభట్ల పెదరామకిష్టయ్య అతిథిగా పాల్గొనగా, పూర్వ విద్యార్థులంతా జ్ఞాపికలను ఆయన చేతుల మీదుగా అందుకున్నారు.

సింగపూర్‌లో బోనాల పండుగ

సింగపూలో బోనాల పండుగలో పాల్గొన్న తెలుగు వారు

కొడిమ్యాల, జూలై 15 : సింగాపూర్ దేశంలోని తెలుగు సమాజం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బోనాల పండుగ నిర్వహించారు. శ్రీ హర్ష కేసరి అమ్మవారికి ప్రతి సంవత్సరం నిర్వహించే బోనాల పండుగలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు అమ్మవారి ఆలయానికి చేరుకొని బోనాలు తీసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. తెలంగాణ నుంచి వచ్చిన ప్రముఖ ఒగ్గుకథ కళాకారుడు నక్క నరేశ్ నిర్వహించిన ఒగ్గుకథ, నృత్యాలు అలరించాయి. దాదాపు 600 మంది తెలుగు వారు ఈ వేడుకలో పాల్గొనగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సింగపూర్ తెలంగాణ సొసైటీ అధ్యక్షుడు బొమ్మరెడ్డి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, జ్యోతీశ్వర్ రెడ్డి, నగేశ్, బైరి రవి, బోయిని సమ్మయ్య, జనార్దన్, ప్రసాద్, మల్లిక్, రమణ, శేఖర్‌రెడ్డి, తదితరులున్నారు.

శుభమైన మురుగు కాలువ

- నమస్తే కథనానికి స్పందన

కొడిమ్యాల, జూలై 14 : మండల కేంద్రంలోని 11వ వార్డులో పోలీస్ స్టేషన్ నుంచి ప్రభుత్వ దవాఖాన వెళ్లే దారిలో డ్రైనేజీ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి, చెత్త పేరుకు పోయింది. ఆదివారం నమస్తే తెలంగాణలో పడకేసిన పారిశుధ్యం వార్తా కథనం ప్రచురితమైంది. స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి వంశీవర్ధన్ సోమవారం సిబ్బందిని పంపించి డ్రైనేజీని శుభ్రం చేయించాడు. పేరుకుపోయిన చెత్తను తొలగింప చేయించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వెల్గటూర్, జూలై 15 : ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఆత్మహత్య చేసుకున్న యువకుడు కొత్తపల్లి నవీన్ (24) సోమవారం దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని కిషన్‌రావుపేటకు చెందిన నవీన్ అమ్మకు మానసిక స్థితి బాగాలేక పోవడంతో రెండు నెలలుగా ఇంటివద్దనే ఉంటున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు పెరగడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 11న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి 9.18 నిమిషాలకు మృతి చెందినట్లు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు. కాగా నవీన్ అన్న మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ పక్షి నెమలి మృతి

కోరుట్ల, జూలై 15: పట్టణంలోని రాంనగర్ కాలనీలో సోమవారం జాతీయ పక్షి నెమలి మృతి చెందింది. రాంనగర్ కాలనీలోని జనావాసాల మధ్య ఖాళీ స్థలంలో మృతి చెంది ఉన్న నెమలిని గమనించిన కౌన్సిలర్ మాడవేణి నరేశ్ ఫారెస్ట్ అధికారులకు సమాచారమిచ్చారు. అధికారులు నెమలిని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం వెటర్నరీ దవాఖానకు తరలించారు.

తెలంగాణ ఉద్యకారుల ఫోరం చైర్మన్‌కు సన్మానం

జగిత్యాల రూరల్, జూలై 15 : ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్ జవ్వాజి శంకర్‌ను సోమవారం భీమారంలో గల్ఫ్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి సన్మానించారు. ఇక్కడ మాల మహానాడు నాయకులు మేడి అంజయ్య, సుమన్, ఉరుమట్ల లక్ష్మణ్, మేదరి శ్రీహరి, బాసమల్ల జనార్దన్, కాయితి రాజు, దేవన్న, లక్ష్మణ్, శ్రీహరి తదితరులున్నారు.

రైల్వేట్రాక్‌పై మృతదేహం

మెట్‌పల్లి, జూలై 15: మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రేగుంట సమీపంలో రైల్వే ట్రాక్‌పై మృతదేహం సోమవారం తెల్లవారు జామున లభ్యమైంది. రైల్వేట్రాక్‌పై మృతదేహం ఉన్నట్లు స్థానికులు సంబంధిత రైల్వేశాఖ అధికారులకు సమాచారం అందించారు. మృతదేహం వద్ద పర్సులో ఉన్న గుర్తింపు కార్డు ఆధారంగా మృతుడిని రేగుంటకు చెందిన లవంగ నరేందర్ (45)గా గుర్తించారు. ఆత్మహత్యా, ప్రమాదమా? అనే కోణంలో రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నరేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రైల్వే విభాగం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెట్‌పల్లి కోర్టు ఏజీపీకి సన్మానం

జగిత్యాల టౌన్, జూలై 15 : మెట్‌పల్లి కోర్టు అదనపు ప్రభుత్వ ప్లీడర్‌గా ఇటీవల నియమితులైన ఎంఏ హఫీజ్‌ను జగిత్యాల టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్, ట్రెసా జిల్లా అధ్యక్షుడు ఎండీ వకీల్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు రవీందర్, మహమూద్, శ్రీనివాస్‌స్వామి, భాస్కర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సూరమ్మ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తాం

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- జగిత్యాల, రాజన్న సిరిసిల్ల కలెక్టర్లతో కలిసి పనుల పరిశీలన

కథలాపూర్, జూలై 15 : వేములవాడ నియోజకవర్గంలో 43 వేల ఎకరాలకు సాగునీరందించే సూరమ్మ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయడమే లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోమవారం కథలాపూర్ మండలం కలికోట గ్రామ శివారులో సూరమ్మ ప్రాజెక్టు మత్తడి నిర్మాణ పనులను జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. సూరమ్మ ప్రాజెక్టులోకి ఏ విధంగా నీళ్లు చేరతాయి, ప్రాజెక్టు ద్వారా ఎన్ని ఎకరాలకు నీరందించవచ్చని ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్లకు వివరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, సూరమ్మ ప్రాజెక్టు కుడి ఎడమ కాలువల కోసం గతంలోనే నిధులు రూ.204 కోట్లు కేటాయించారన్నారు. మరోవైపు ఎస్సారెస్పీ వరదకాలువ ద్వారా సూరమ్మ ప్రాజెక్టులోకి నీళ్లు చేరేలా ఎత్తిపోతల కోసం సుమారు రూ.500 కోట్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరతామన్నారు. కథలాపూర్ మండలం భూషణరావుపేట శివారులో రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువకు గండిని త్వరగా మరమ్మతులు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు మధుసూదన్, రాజేశ్వర్, నీటిపారుదలశాఖ ఈఈ సంతోష్‌ప్రకాశ్‌రావు, తహసీల్దార్ ముంతాజిబొద్దిన్, ఎంపీడీవో శంకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నాగరాజు, నాయకులు గంగాధర్, అంజయ్య, ధనుంజయ్‌రెడ్డి, మహేశ్, రవి, బోదాసురెడ్డి, గట్ల మీనయ్య, అజీమ్ తదితరులున్నారు.

కథలాపూర్ : సూరమ్మ ప్రాజెక్టు వద్ద పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బీసీ సంక్షేమ సంఘానికి స్థలం కేటాయించాలి

మేడిపల్లి, జూలై 15 : మండలంలోని కట్లకుంటలో బీసీ సంక్షేమ సంఘానికి స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘ సభ్యులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఇక్కడ బీసీ సంక్షేమ సంఘం గ్రామాధ్యక్షుడు బెజ్జూరపు ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు బక్కశెట్టి రాజరెడ్డి, పెడిమల్ల పెద్ద రాజన్న, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీపతి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల, జూలై 15 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన వనమహోత్సవంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఈద్గా దగ్గర ఐపీఎస్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో వనమహోత్సవంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొన్నారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ, పర్యావరణాన్ని పరిరక్షణకు పాటుపడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం, మైనార్టీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గిరి నాగభూషణం, కౌన్సిలర్ దుర్గయ్య, స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

పెగడపల్లి, జూలై 15: ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పెగడపల్లి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని ఎల్లాపూర్‌లో వన మహోత్సవంలో భాగంగా గ్రామ సమీపంలోని గుట్ట వద్ద ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న కమ్యూనిటీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఎంపీడీవో పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి నరేందర్, ఈజీఎస్ ఎఫ్ఏ మల్లేశం, ఉపాధి కూలీలున్నారు.

మొక్కను నాటుతున్న జీవన్ రెడ్డి, జ్యోతి

రాయికల్, జూలై 15 : పట్టణంలోని ఒకటో వార్డులో సోమవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, కౌన్సిలర్లు వార్డులో ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. మండలంలోని అల్లీపూర్ బీసీ గురుకుల పాఠశాలలో అధికారులు ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటారు. ఇక్కడ మున్సిపల్ చైర్మన్ హన్మాండ్లు, వైస్‌చైర్మన్ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, అల్లీపూర్ ప్రత్యేకాధికారి తహసీల్దార్ ఎండీ ఖయ్యూమ్, కౌన్సిలర్లు సాయికుమార్, శ్రీధర్ రెడ్డి, దివ్య, అనిల్, అనురాధ, సింగిల్ విండో చైర్మన్ మల్లారెడ్డి, మున్సిపల్ మేనేజర్ వెంకటి, మాజీ సర్పంచ్ గంగారెడ్డి, ఆప్షన్ మెంబర్ ముఖీద్ పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయానికే గ్రీవెన్స్ డే

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల, జూలై 15 : బాధితులకు సత్వర న్యాయం అందిచడానికే గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో భాగంగా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొన్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. భూ, ఆస్తి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా బాధితులకు సత్వర న్యాయం అందించేలా చూడాలని అధికారులకు సూచించారు.

పాఠశాలకు టీవీ వితరణ

కోరుట్ల, జూలై 15: పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్-రమ్య దంపతుల కుమారుడు శ్రీరాగ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సరస్వతి శిశు మందిరం పాఠశాలకు సోమవారం ఆండ్రాయిడ్ టీవీని వితరణ చేశారు. విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాస్‌లు బోధించేందుకు ఉపయోగపడే టీవీని బహూకరించిన దాతను పాఠశాల నిర్వాహకులు అభినందించారు. ఇక్కడ పాఠశాల కరస్పాండెంట్ నీలి శ్రీనివాస్, క్లబ్ కార్యదర్శి శ్రీగద్దె నరేంద్ర, పీఈటీ అనిల్, లింగారెడ్డి, తదితరులున్నారు.

'ఉద్యోగాల భర్తీకి కట్టుబడి ఉన్నాం'

జగిత్యాల, జూలై 15: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి కట్టుబడి ఉన్నదని పట్టభద్రుల ఎమ్మెల్సీ టీ జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాలలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే ప్రభుత్వం 30 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసిందని చెప్పారు. నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉన్నదన్నారు. గ్రూప్-1 అభ్యర్థుల అభ్యర్థన మేరకు మెయిన్స్‌కు 1:50 కి బదులు 1:100కి అవకాశమిస్తే న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయని అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాది నుంచి జాబ్ క్యాలెండర్‌ను అమల్లోకి తీసుకువస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మాజీ చైర్మన్ గిరినాగభూషణం, బండ శంకర్, కొత్త మోహన్ ఉన్నారు.

ఎస్సారెస్పీ స్థలాన్ని కొనుగోలు కేంద్రానికి కేటాయించాలి

మెట్‌పల్లి రూరల్, జూలై 15: మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శివారులో ఆక్రమణకు గురైన ఎస్సారెస్పీ స్థలాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించాలని రైతులు కోరారు. ఈమేరకు సోమవారం మెట్‌పల్లి ఆర్డీవో, నీటిపారుదల శాఖ, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. వెల్లుల్ల రైతువేదిక సమీపంలో గల ఎస్సారెస్పీ స్థలాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రం నిమిత్తం ఇటీవల చదును చేశామన్నారు. అయితే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి సంబంధిత స్థలాన్ని ఆక్రమించారని పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు బాదినేని అశోక్, వేముల మల్లయ్య, సిరికొండ రాజరెడ్డి, నీలి చిన్నగంగారెడ్డి, వెల్మ రాజేశ్, సుర్కంటి నారాయణ, కోలు రాజేందర్, రాజం ట్రాన్స్‌ఫార్మర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుబ్బ రాజన్న ఆలయంలో రాజేశంగౌడ్ పూజలు

సారంగాపూర్, జూలై 15 : పెంబట్ల శ్రీదుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గొడిసెల రాజేశం గౌడ్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి గ్రానైట్ ఫ్లోరింగ్ ఏర్పాటుకు సహకారం అందజేస్తానని రాజేశం గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి, ట్రస్ట్ ఫౌండర్ శంకరయ్య, మాజీ ఎంపీపీ బాపురెడ్డి, నాయకులు బైరి మల్లేశం, రాజేందర్, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ యూత్ స్కిల్స్ డే వేడుకలు

జగిత్యాల/ జగిత్యాల టౌన్, జూలై 15 : వరల్డ్ యూత్ స్కిల్స్ డే సందర్భంగా నలంద డిగ్రీ కళాశాలలో దేశ్‌పాండే ఫౌండేషన్, కాకతీయ సాండ్‌బాక్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. కాకతీయ సాండ్ బాక్స్ రీజినల్ మేనేజర్ శేఖర్ గోనె మాట్లాడుతూ, నైపుణ్యం గల యువత కొరత చాలా ఉందన్నారు. దేశ్‌పాండే ఫౌండేషన్, కాకతీయ సాండ్ బాక్స్ వారు గ్రామీణ ప్రాంత డిగ్రీ చదివే విద్యార్థులకు ఆరు నెలల పాటు నైపుణ్య శిక్షణ ఇచ్చి మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు ఇప్పిస్తుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్ మాట్లాడుతూ, తమ కళాశాలలో చదివే విద్యార్థులకు కార్పొరేట్ శిక్షణ ఇచ్చేందుకు ఈ ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం చేసుకుని విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇప్పిస్తున్నామని ఇప్పటి వరకు 150 పైన విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేశ్, అకడమిక్ కోఆర్డినేటర్ నరేందర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాల రూరల్, జూలై15 : జగిత్యాలలోని రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సోమవారం ప్రపంచ నైపుణ్య దినోత్సవం సందర్భంగా దేశ్ ఫౌండేషన్, కళాశాల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ మాట్లాడుతూ, నైపుణ్యాలను కలిగి ఉన్న వారే భవిష్యత్తులో అవకాశాలను అందిపుచ్చుకుంటారని అన్నారు. దేశ్ ఫౌండేషన్ ప్రతినిధులు శేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, వెంకటరమేశ్, మల్లేశం, తదితరులున్నారు.

జగిత్యాల టౌన్, జూలై 15 : జిల్లా కేంద్రంలోని ఎన్ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో యూత్ స్కిల్స్ డే వేడుకలను కాకతీయ సాండ్ బాక్స్, ఎన్ఎస్‌వీ డిగ్రీ కళాశాల సంయుక్తంగా నిర్వహించారు. ఎన్ఎస్‌వీ విద్యా సంస్థల అధినేత యాద రామకృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిగ్రీ సర్టిఫికెట్‌తోపాటు కార్పొరేట్ స్థాయి ఉద్యోగాల సాధనకు కావాల్సిన నైపుణ్యాలను డిగ్రీతో పాటుగా నేర్చుకున్నపుపడే ఉద్యోగ సాధన సులభం అవుతుందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ శ్రీపాద నరేశ్, ప్రిన్సిపాల్ గోపు మునీందర్‌రెడ్డి, మల్లికార్జున్, విద్యార్థులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్లాపూర్, జూలై 15: మండలంలోని మొగిలిపేట బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త ఎల్లాల జీవన్‌రెడ్డి తండ్రి నర్సారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా వీరి కుటుంబ సభ్యులకు సోమవారం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ వంతడపుల నాగరాజు, నాయకులు మిట్టపల్లి మోహన్‌రెడ్డి, దండవేణి వెంకట్, ఓస రాజరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

బీసీ నాయకుల ముందస్తు అరెస్టు

స్టేషన్ ఎదుట బీసీ నాయకులు

రాయికల్, జూలై 15 : హైదరాబాద్‌లో పది రోజులుగా జరుగుతున్న నిరుద్యోగుల ధర్నాకు